క్లుప్తంగా

చిరు వ్యాపారులపై జనసేన నేత దౌర్జన్యం


వ్యాపారులను బెదిరిస్తున్న రమేష్

తిరుపతి తుడా : తిరుపతిలో కూటమి నేతల దౌర్జన్యాలు, వికృత చేష్టలు మితిమీరుతున్నాయి. 14వ వార్డులో బుధవారం జనసేన ఇన్‌చార్జి రమేష్ ఫుట్‌పాత్ వ్యాపారులపై దౌర్జన్యం చేశాడు. కమీషన్ ఇవ్వకపోతే వ్యాపారం చేసుకోలేరని బెదిరించాడు. దీన్ని గమనించిన స్థానికులు సైతం భయభ్రాంతులకు గురయ్యారు. ఇలాంటి వారిపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం



తిరుపతి తుడా : రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలో వున్న రుయాలో సెక్యూరిటీ విభాగంలో ఎంఎన్‌వోగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కె.పార్థసారిథికి నర్సింగ్ సిబ్బంది రూ.45,500 ఆర్థిక సాయం అందించారు. వారు బుధవారం కుటుంబ సభ్యులుకు నగదు అందజేశారు. జే గంగమ్మ, ఏ మానసాదేవి, పి దుర్గా, సుజాత, సురేంద్ర, ప్రకాష్, మరికొంతమంది నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

తిరుపతి కల్చరల్: దేశ వ్యాప్తంగానున్న ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం 27 నుంచి 47 శాతం రిజర్వేషన్లు పెంచి అమలు చేయాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 1990 ఓబీసీల జనాభా నిష్పత్తి ప్రకారమే రిజర్వేషన్లు అమలు చేయడం సిగ్గుచేటన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ప్రశ్నించాలని కోరారు. ఓబీసీ విద్యార్థి సంఘ నేతలు సాయి, విజయ్ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

చంద్రగిరి: మండలంలోని కోదండరామాపురం వద్ద మంగళవారం రాత్రి ఆటో ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పనపాకం పంచాయతీ బోడిగుట్టవారిపల్లికి చెందిన దయాసాగర్, పార్థసారథి తిరుపతి రుయాలో పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌లో ఇంటికి వెళుతున్నారు. కోదండరామాపురం వద్ద బైక్ పంక్చర్ అయ్యింది. దయాసాగర్ ఐతేపల్లి వద్ద వాహనాన్ని పంక్చర్ దుకాణం వద్దకు తీసుకెళ్లాడు. పార్థసారథి సర్వీసు రోడ్డులోకి దాటుతుండగా ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని 108లో తిరుపతి రుయాకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది.

అప్పనంగా కాజేస్తున్నారు..!

అధికారాన్ని అడ్డుపెట్టుకుని కూటమి నేతలు బరితెగిస్తున్నారు. ఇసుక, గ్రావెల్‌ను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పుడు వారి కన్ను ప్రభుత్వ భూములపై పడింది. రూ.లక్షల విలువైన స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు పట్టించకోకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- గయాలు భూమిపై కన్నేసిన కబ్జాదారులు
- రూ.50 లక్షల భూమి తనేదనంటూ దబాయింపు


అక్రమార్కుడుతున్న చూపుతున్న మ్యాప్


అధికార పార్టీ నేతల అండతో కబ్జా చేసేందుకు యత్నిస్తున్న గయాలు భూమి ఇదే

చంద్రగిరి : తిరుపతి జిల్లా కేంద్రం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లోని భూములకు డిమాండ్ పెరిగింది. ఒక్కసారిగా ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో కొంతమంది కూటమి నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. చంద్రగిరి మండలం ఏ.రంగంపేట సమీపంలో ఒక వ్యక్తి సుమారు రూ.50 లక్షల విలువైన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించాడు. ఈ విషయం మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. నాగపట్ల పరిధిలోని సర్వే నంబరు 249/3లో 42 సెంట్ల గయాలు భూమి ఉంది. ఇది మోహన్‌బాబు యూనివర్సిటీకి అత్యంత సమీపంలో ఉంది. దానికి ఆనుకునే వెంచర్ ఏర్పాటుచేయడంతో ఆ భూమికి విపరీతమైన డిమాండ్ ఉంది. అంకణం రూ.లక్షల్లో పలుకుతోంది. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ఆ భూమిపై కన్నేశాడు. అధికార పార్టీ నేతల అండతో దాన్ని కాజేసేందుకు పథకం పన్నాడు. ఇటీవల ఆ భూమిలోకి ప్రవేశించి తనదేనంటూ దబాయించాడు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతను ఇప్పటికే అటవీ బంగ్లా సమీపంలోని ప్రభుత్వ పోరంబోకు భూమి సుమారు రూ.50 లక్షల విలువైన 100 అంకణాలను ఆక్రమించుకున్నాడని పేర్కొంటున్నారు. ఈ విషయం తెలిసినా అధికార పార్టీ పెద్దల ఒత్తిళ్లతో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై వీఆర్వో భాస్కర్ వివరణ ఇస్తూ సర్వే నంబరు 249/3లోని గయాలు భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. నిఘా పెట్టాలని సిబ్బందిని ఆదేశించినట్టు తెలిపారు.

కల్వర్టులు కనుమరుగు

మండలంలోని తొండవాడ పంచాయతీలో జాతీయ రహదారిలోని హ్యాపీ దాబాకు ఎదురుగా వున్న కల్వర్టును స్థానిక టీడీపీ నేతలు ఆక్రమించుకున్నారు. పిల్లర్లు వేసి, పైపుల ద్వారా కాలువను పూడ్చి వేశారు. అపై ఎర్రమట్టితో చదును చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా కల్వర్టు ఆక్రమణ తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను బుధవారం టీటీడీ జేఈవో వి.వీరబ్రహ్మం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న ఆలయంలో నిర్వహించే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్కరిణిని శుభ్రంగా ఉంచాలని, ఆకర్షణీయంగా పెయింటింగ్, రంగోలీలు వేయించాలని సూచించారు. వాహనాలకు మరమ్మతులు, పెయింటింగ్, ఫ్లెక్సీలు, క్యూలైన్లు తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తిరుపతి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆర్చ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, అన్నప్రసాదాలు అందించేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ కేపీ.చంద్రశేఖర్, డీఈ మల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ దాము, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.5.5 లక్షల విద్యా సామగ్రి వితరణ


మాట్లాడుతున్న దాత బైరెడ్డి ప్రకాష్

చంద్రగిరి: మండలంలోని దోర్నకంబాల ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి బైరెడ్డి ప్రకాష్ బుధవారం రూ.5.5 లక్షల విలువైన 10 కంప్యూటర్లు, 10 టేబుళ్లు, 10 కుర్చీలు, విద్యార్థుల కోసం 25 డెస్కులు వితరణ చేశారు. అలాగే పాఠశాల ఆటస్థలాన్ని చదును చేయించారు. వంట గదిని బాగు చేయించారు. పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. తర్వాత సమాజ సేవా చేయాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి సహాయాన్ని అందించినందుకు ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, సంధ్యాలక్ష్మి, రాజేంద్ర, ఉమ, అనూష, గురవమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక నిర్ణయాలపై పోరాటాలు

తిరుపతి కల్చరల్: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలు చేద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. టీటీడీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ నెల 23న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలపై ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు పోరాటాలకు రూపకల్పన చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, ఎన్‌డీ.రవి, శివకుమార్, గోవిందస్వామి, శ్రీరాములు, ఉదయ్‌కుమార్, నాగరాజమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లా వాసి నేత్రదానం


మృతురాలి కటుంబ సభ్యులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న వైద్యసిబ్బంది

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన వైఎస్సార్ జిల్లా వాసి ఎం లీలావతి(61) కళ్లను దానం చేసేందుకు ఆమె కుమారుడు ఎం సిద్ధారెడ్డి ముందుకు వచ్చారు. రుయా కంటి విభాగం అధిపతి డాక్టర్ చలపతి రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నేత్రాలను సేకరించి నేత్ర నిధి బ్యాంకులో భద్రపరిచారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు నేత్రాలు, అవయవాలు దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో వున్న పేద రోగులకు మరో జన్మ ఇవ్వవచ్చన్నారు. అవయవదానం చేసిన మృతురాలి కుటుంబ సభ్యులను అభినందించారు. నేత్రదానం చేయదలిచిన ప్రజలు 8500880126 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఎస్.రమేష్, మృతురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ గుర్తింపు కార్డు తప్పనిసరి

చంద్రగిరి: ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రతి రైతూ తప్పనిసరిగా గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఏవో విజయ భాస్కర్ తెలిపారు. ఆయన బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు తరహాలో రైతుకు 11 నంబర్లతో యూనిక్ కోడ్‌తో గుర్తింపు కార్డులు అందజేస్తున్నట్టు తెలిపారు. దీనిద్వారానే రైతులు సబ్సిడీలు, రుణాలు, పంటల బీమా తదితరాలు అందుతాయన్నారు. దేశంలో ఎక్కడి నుంచి అయినా ప్రభుత్వ పథకాల వివరాలను తెలుసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు.

గరుడునిపై వెంకన్న చిద్విలాసం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు బుధవారం గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారు గరుడ వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

రేపు షికారీల సమ్మేళనం

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలోని గిరిజన భవన్‌లో శుక్రవారం షికారీల సమ్మేళం నిర్వహించనున్నట్టు అఖిల భారతీయ ఆదిమ మహాసంగ్ ముఖ్య సలహాదారు మల్లి సుబ్బారావు తెలిపారు. ఆయన బుధవారం ఆ సంఘం సభ్యులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో సమ్మేళనం కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విముక్త సంచార జాతులుగా పేర్కొనే తమకు ఎస్సీ, ఎస్టీల్లాగే ప్రత్యేక గుర్తింపు కల్పించాలని కోరారు. ఇందుకోసం పోరాటాలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ క్రమంలోనే సమ్మేళనం చేపట్టినట్టు తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి వివిధ సంఘాల ప్రతినిధులు సుమారు 350 మంది పాల్గొంటున్నట్టు తెలిపారు. ఇందులో షికారీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారానికి తీసుకోవాల్సిన కార్యాచరణకు చర్యలు తీసుకుంటామన్నారు.

జేఈఈలో విద్యార్థుల ప్రతిభ


అశ్వమేధ విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు


జేఈఈలో ప్రతిభ చూపిన శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జేఈఈ మెయిన్స్ ఫేస్-1 ఫలితాల్లో పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. మంచి పర్సంటైల్ సాధించారు. వారిని కళాశాలల డైరక్టర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

అశ్వమేధలో..

తిరుపతి నగరం ఎమ్ఆర్‌పల్లి సర్కిల్‌లోని అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి మంచి పర్సంటైల్ సాధించారని డైరెక్టర్ అబ్దుల్ ఇశ్రత్, టీఎం గోవర్ధన్ తెలిపారు. పి.నిఖిల్ 99.3, వెంకటసాయి 98.7, కె.యశశ్రీ 98.5, వెంకటరెడ్డి 98.3, వి.మోక్షిత 92.4, శ్రీవైష్ణవి 92.1 పర్సంటైల్ సాధించారని తెలిపారు. వారిని ప్రిన్సిపాల్ సుమతి, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

శ్రీధర్స్ అకాడమిలో..

తిరుపతి నగరం ఎయిర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫేస్-1 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపినట్టు చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. నిఖిలేశ్వర్ 99.25, మహ్మద్ తాలిబ్ 98.74, ఎండీ ఇమ్రాన్ 98.65, డి.పోషిత 97.25, మంజుశ్రీ 97.02, నిత్యశ్రీ 92.02 పర్సంటైల్ సాధించారని తెలిపారు. మరో 10 మంది 90 పర్సంటైల్, 53 మంది 85 పర్సంటైల్‌కు పైగా మార్కులు సాధించారని తెలిపారు.

నేటి నుంచి ఎన్ఎస్‌యూలో వర్క్‌షాపు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో గురు, శుక్రవారాలు అడమిక్ రైటింగ్ టు డెవలప్ టెక్స్ట్‌బుక్స్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ భారతీయ లాంగ్వేజ్ మీడియం అన్న అంశంపై వర్క్‌షాపు నిర్వహించనున్న ట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.